
సాక్షి ఒడిశా

సోమవారం । 18 । సెప్టెంబర్ । 2023



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 5,32,766
బంగారం	1 గ్రాము 800 మిల్లీ గ్రాములు
వెండి	37 గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



విశ్వకర్మకు విశేష పూజలు

రాష్ట్రవ్యాప్తంగా విశ్వకర్మ పూజలు ఘనంగా జరుగుతున్నాయి. -8లో



గోపాల్‌పూర్‌లో డ్రెడ్జింగ్

గోపాల్‌పూర్ తీరంలో డ్రెడ్జింగ్ పనులు జోరుగా సాగుతున్నాయి. -8లో

న్యూస్‌రీల్

భక్తిశ్రద్ధలతో సత్యసాయి పాదుకా పూజలు



సాయిభక్తులతో డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా పపడా హండి సమితి కేంద్రానికి ఆదివారం సత్యసాయి రథం చేరుకుంది. ఈ సందర్భంగా భక్తులు సత్య సాయి పాదుకా పూజలు ఘనంగా నిర్వహించారు. ఇక్కడి పురాతన శివ మందిరంలో రుద్రభిషేకాలు చేశారు. జిల్లా వ్యాప్తంగా సాయి భక్తులు పపడాహండి చేరుకున్నారు. డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి సాయిభక్తుల వద్దకు చేరుకుని వారు జిల్లా వ్యాప్తంగా చేస్తున్న సేవలు కొనియాడారు. వారం రోజుల పాటు పలు గ్రామాల్లో రథం ద్వారా సాయి సేవలు ప్రచారం చేయనున్నారు. కార్యక్రమంలో సాయి కమిటీ కన్వీనర్ పి.లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి మావోయిస్టు వారోత్సవాలు



విడుదలైన లేఖ

మల్కన్‌గిరి: మావోయిస్టులు ఆంధ్ర–ఒడిశా స్పెషల్ జోనల్ కమిటీ పేరిట ఆదివారం లేఖను విడుదల చేశారు. మావోయిస్టు పార్టీ ఏర్పాటై 19 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ నెల 21 నుంచి 27 వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పార్టీ అగ్రనేత గణేష్ పేర్కొన్నారు. బొండఘాటీలో మఝిగూఢ వద్ద గ్రానైట్ కంపెనీ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.

21 మంది జూదరుల అరెస్టు



స్వాధీనం నగదు, ఫోన్లు

బరంపురం: నగర శివారులోని బి.ఎన్.పూర్ పోలీసుస్టేషన్ పరిధిలో అంకులి జంక్షన్ సమీపంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడులు చేశారు. 21 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.4 లక్షల 99 వేల నగదు, 9 వాహనాలు, 23 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్ అందించిన సమాచారం మేరకు శనివారం అర్ధరాత్రి ఈ దాడులు జరిపారు. బరిబందా విహార్, గణేష్ నగరలోని ఓ ఇంట్లో రహస్యంగా ఆడుతుండగా వీరిని పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు.

వేధింపుల కేసులో ముగ్గురి అరెస్టు

జయపురం: మహిళను శారీరకంగా, మానసికంగా, వరకట్న వేధింపులకు గురిచేసిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి తెలిపారు. 2017లో నమోదైన కేసులో నిందితులకు కోర్టు పలుమార్లు నోటీసులు పంపినా హాజరు కాకపోవటంతో నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో జయపురం సమితి ఖుడిపి గ్రామానికి మహదేవ్ హరిన్, అతని భార్య హీరామని హరిజన్, కోడలు శిబాణి హరిజన్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామని పోలీసులు తెలిపారు. బెయిల్ నిరాకరించటంతో జైలుకు తరలించినట్లు చెప్పారు.

35 టోల్ గేట్లు రద్దు

భువనేశ్వర్: రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణాభివృద్ధి (ఆర్‌డీ), వర్క్స్ డిపార్ట్‌మెంట్లకు చెందిన వివిధ రహదారులపై ఉన్న 35 టోల్ గేట్లను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 35 టోల్ గేట్‌లలో 34 వర్క్స్ డిపార్ట్‌మెంట్ రోడ్లపై ఏర్పాటు చేయగా, మరొకటి గ్రామీణాభివృద్ధి విబాగం రోడ్డులో నిర్వహిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లపై ట్రాఫిక్ రద్దీని నివారించడానికి, వాహనాలకు ఇబ్బంది లేకుండా వెళ్లేందుకు ఒడిశా వంతెన, నిర్మాణ కార్పొరేషన్ (ఓబీసీసీ) నిర్వహిస్తున్న వర్క్స్, గ్రామీణాభివృద్ధి విభాగం రోడ్లపై ఉన్న మొత్తం 35 టోల్ గేట్లను తొలగించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నెల 15న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఓబీసీసీ టోల్ గేట్లను రద్దు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది.

వదలని వాన

- ముంచెత్తుతున్న వరదనీరు
- పొంగి పొర్లుతున్న నదులు
- ముంపులో వందలాది గ్రామాలు
- ఇబ్బందుల్లో ప్రజలు



చికిటి బ్లాక్ వద్ద బౌదా నది ఉధ్ధృతి



బౌదా నది వరద నీట మునిగిన వేలాది ఎకరాల వరి పంట



ఆంధ్రా–ఒడిశా సరిహద్దు వద్ద వరదనీరు



కుండపోత వర్షం



పత్రపూర్ బ్లాక్ సమంతపల్లి వద్ద బాగీ నదికి గండి

బరంపురం: రాష్ట్రాన్ని వర్షాలు వీడటం లేదు. ఉత్తర ఈశాన్య బంగాళాఖాతంలో 5.8 కిలోమీటర్ల దూరంలో ఏర్పడిన అల్ప పీడనం కారణంగా నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం కూడా ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షం కారణంగా ఆంధ్ర ఒడిశా సరిహద్దు గంజాం జిల్లా పత్రపూర, చికిటి బ్లాక్‌లలో వందలాది గ్రామాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. వేలాది ఎకరాల ఖరీఫ్ పంట నీటమునిగింది. ఆంధ్ర–ఒడిశా సరిహద్దులోని చికిటి బ్లాక్ పరిధిలో పాయకరాపల్లి గ్రామానికి ఆనుకుని ఉన్న బగ్గలట్టి డ్యామ్, గడహడ్ డ్యామ్‌ల ద్వారా ఒక్కసారిగా వరద నీరు విడుదల కావడంతో వేలాది ఎకరాల్లో వరి పంట జల విలయంలో చిక్కుకుంది. గడడడా, భగువా, బడ నది, రుసికుల్యా నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. గంజాంలోని రూశికుల్యా నది, బెడొ నదులు ఉధృతంగా ప్రవహించడంతో అస్కా, కవిసూర్యనగర్, ఛత్రపూర్, గంజాం, కోదలా, కళ్లికోట్, బంజనగర్, హింజిలికాట్, జగన్నాథ్ ప్రసాద్ సమితి పరిధిల్లో వందలాది లోతట్టు గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. బౌదా నది ప్రవాహం ధాటికి పలుచోట్ల వంతెనల వద్ద గండ్లు పడ్డాయి. దీంతో రాకపోకలు స్తంభించాయి.

సిద్ధి గణపతి వేడుకలకు సిద్ధం



జయపురం: ఆంధ్రప్రదేశ్ నుంచి తీసుకొచ్చిన వినాయక విగ్రహాలు



రాయగడ: గణనాథుని ప్రతిమను ఇంటికి తీసుకువెళుతున్న దృశ్యం



జయపురంలో మట్టి వినాయకులు

రాయగడ: వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. రాయగడ పట్టణంలో గణనాథుని వేడుకల నేపథ్యంలో మార్కెట్ ప్రాంతం రద్దీగా కనిపించింది. పూజా సామగ్రి విక్రయాలతో దుకాణాలు కిటకిటలాడాయి. రైతుల కాలనీ, బుదరావలస ప్రాంతాల్లో 32, 40 అడుగుల మేర భారీ విగ్రహాలను కొలువుదీర్చేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

మట్టి వినాయకులకు ప్రాధాన్యం..

జయపురం: జయపురం పట్టణవాసులు వినాయక ఉత్సవాలకు సిద్ధమవుతున్నారు. ఈసారి ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కాకుండా మట్టి ప్రతిమలనే పూజించేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. దీంతో పలువురు వర్తకులు ఆంధ్రప్రదేశ్ నుంచి మట్టి బొమ్మలు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు.

బలవంతపు చందా వసూలు చేస్తే కేసులు

- బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్



మాట్లాడుతూన్న బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్

బరంపురం: వినాయక చవితి, దసరా ఉత్సవాల నేపథ్యంలో బలవంతపు చందాలు వసూలు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్ పోలీసులను ఆదేశించారు. ఆదివారం ఎస్పీ కార్యాలయంలో వివిధ పోలీసుస్టేషన్ ఐఐసీ అధికారులు, ఎస్‌డీపీఓలు, డీఎస్పీలు, ఏఎస్పీలతో నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నవరాత్రి పూజల పేరిట బలవంతంగా చందాలు వసూలు చేసిన వారిపై కేసులు బనాయించి జైలుకు తరలించాలన్నారు. పూజా మండపాల వద్ద ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసి కమర్షియల్ బిల్లు వసూలు చేయాలన్నారు. ముందస్తు రూట్ ప్రకారమే నిమజ్జనం జరగాలన్నారు. అదే విధంగా, జూద శిబిరాలపై నిఘా పెట్టి దాడులు ముమ్మరం చేయాలని ఆదేశించారు. సమావేశంలో పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రానికి వరద ముప్పు లేదు

భువనేశ్వర్: రాష్ట్రంలో కొన్ని రోజులుగా వివిధ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ వరదలు వచ్చే అవకాశం లేదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేశారు. ఈ మేరకు జల వనరుల శాఖ ఇంజనీర్ – ఇన్ – చీఫ్ భక్తి రంజన్ మహంతి ప్రకటన విడుదల చేశారు. భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ రాష్ట్రంలో వరదలు వచ్చే అవకాశం లేదని అభయం ఇచ్చారు. మహానది ఎగువ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సంబల్‌పూర్‌లోని హిరాకుడ్ జలాశయంలో నీటి మట్టం పెరగడంతో అదనపు నీటిని విడుదల చేసేందుకు జలాశయం 64 స్లూయిస్ గేట్లలో మొత్తం 26 తెరిచినట్లు తెలిపారు. హీరాకుడ్ జలాశయం నుంచి అదనపు నీటిని విడుదల చేయడంతో కొన్ని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని, ఒకటి లేదా రెండు రోజుల్లో నీరు తగ్గుతుందని చెప్పారు. మహా నది పరీవాహక ప్రాంతంలో వరదలు తలెత్తే అవకాశం లేదని, ప్రస్తుతం 26 స్లూయిస్ గేట్ల ద్వారా హీరాకుడ్ డ్యాం నుంచి అదనపు నీటిని విడుదల చేస్తున్నామని, మరిన్ని గేట్లను తెరిచే ఆలోచన లేదని మహంతి స్పష్టం చేశారు. ఈ నెల 22 నుంచి పలు చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉన్నప్పటికీ, వరద పరిస్థితి తలెత్తే అవకాశం లేదన్నారు. ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్‌ఆర్‌సీ)తో జల వనరుల శాఖ నిరంతరం సంప్రదింపులు జరుపుతోందన్నారు. కాగా, మహా నదిలో కటక్ సమీపం ముండలి వద్ద 6.83 లక్షల క్యూసెక్కులు, బొరొముల్ వద్ద 6.70 లక్షల క్యూసెక్కులు, ఖైర్మల్ వద్ద 6.30 లక్షల క్యూసెక్కులకు పైగా నీటి మట్టం నమోదైందని అధికారిక వర్గాలు తెలిపాయి.

నవీన్ సోదరి గీతా మెహతా కన్నుమూత

- ఒడిశాలో విషాదఛాయలు
- అక్కను కడసారి చూసేందుకు ఢిల్లీ చేరుకున్న ముఖ్యమంత్రి



గీతా మెహతా



గీతా మెహతా భౌతికకాయం



నవీన్ పట్నాయక్, గీతా మెహతా(ఫైల్)

భువనేశ్వర్/కొరాపుట్: రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సోదరి గీతా మెహతా (80) శనివారం రాత్రి న్యూఢిల్లీలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆదివారం ఉదయం విషయం బయటకు రావడంతో రాష్ట్ర ప్రజలు విషాదంలో మునిగిపోయారు. ఓవైపు రాష్ట్ర వ్యాప్తంగా విశ్వకర్మ పూజలు కోలాహలంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ నుంచి ఎటువంటి సూచనలు లేకపోయినప్పటికీ పార్టీ నాయకులు పరోక్ష సంతాప సూచకంగా ఎటువంటి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనలేదు. ముఖ్యమంత్రి నవీన్ ఆదివారం న్యూఢిల్లీ చేరుకున్న దృశ్యాలు ప్రజలు టీవీల్లో వీక్షించారు.

గాంధీ కుటుంబంతో స్నేహం..

దివంగత ఉత్కళ వరపుత్రుడు బిజూ పట్నాయక్‌కు ఇద్దరు కుమారులు ప్రేమ్ పట్నాయక్, నవీన్ పట్నాయక్, ఒక కుమార్తె గీతా ఉన్నారు. వీరందరి బాల్యం లండన్‌లో జరిగింది. ప్రేమ్ ప్రముఖ పారిశ్రామికవేత్త కాగా, గతంలోనే మృతిచెందారు. గీతా అంతర్జాతీయ కవయిత్రి. కేంద్ర ప్రభుత్వం నుంచి పద్మశ్రీ అవార్డు సైతం అందుకున్నారు. బిజూ సంతానినికి బాల్యంలో గాంధీ కుటుంబంతో స్నేహ సంబంధాలు ఉండేవి.

చివరి చూపు కోసం..

నవీన్ న్యూఢిల్లీ నుంచి మీడియాతో మాట్లాడుతూ అక్క చివరి చూపు కోసం ఢిల్లీ వచ్చానని ప్రకటించారు. కాగా, నవీన్ ఉండగా ఏనాడూ అతని కుటుంబం రాజకీయాల్లో జోక్యం చేసుకోలేదు. అప్పుడప్పుడు నవీనే ఢిల్లీ వెళ్లి అక్కని చూసేవారు. గీత మృతిలో రాష్ట్రంలో విషాద ఛాయలు అలముకున్నాయి. గీతా మెహతా అంత్యక్రియలు సోమవారం జరగనున్నాయి.

ఘన చరిత్ర..

దివంగత ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్ కుమార్తె గీతా మెహతా రచయిత్రిగా, లఘు చిత్ర నిర్మాతగా, జర్నలిస్ట్‌గా పేరొందారు. ప్రఖ్యాత అమెరికన్ పబ్లిషర్ దివంగత సోనీ మెహతాను 1965లో గీతా మెహతా వివాహం చేసుకున్నారు. ఢిల్లీలో బిజు, జ్ఞాన్ పట్నాయక్ దంపతులకు 1943లో జన్మించిన ఆమె తన విద్యను భారత్‌తో పాటు యూకే కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయంలో పూర్తి చేశారు. 2019లో భర్త సోనీ మెహతా మరణించినప్పటి నుంచి ఆమె భారత్‌లోనే ఉంటున్నారు. రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు.

- కర్మ కోలా, స్నేక్ అండ్ ల్యాడర్స్, ఎ రివర్ సూత్ర, రాజ్ అండ్ ది ఎటర్నల్ గణేషా అనే మూడు పుస్తకాలను రచించారు.
- తన రచనలలో భారత చరిత్ర, సంస్కృతి, మతాన్ని చిత్రీకరించారు. ఈమె రచనలు 13 భాషల్లోకి అనువాదమయ్యాయి. 27 దేశాలలో ప్రచురితమయ్యాయి. యూకే, యూరోపియన్ దేశాలు , యునైటెడ్ స్టేట్స్ కోసం 14 బుల్లి తెర లఘు చిత్రాలను మెహతా నిర్మించి దర్శకత్వం వహించారు.
- 1970లలో నేషనల్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీకి చెందిన యునైటెడ్ స్టేట్స్ టెలివిజన్ నెట్‌వర్క్‌కు గీత యుద్ధ ప్రతినిధిగా పని చేశారు. యూఎస్ టీవీ నెట్‌వర్క్ ఎన్‌బీసీ కోసం గీతా మెహతా బంగ్లాదేశ్ యుద్ధాన్ని కవర్ చేశారు. బంగ్లాదేశ్ విముక్తి యుద్ధంపై డేట్‌లైన్ బంగ్లాదేశ్ పేరుతో శక్తివంతమైన డాక్యుమెంటరీని రూపొందించి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఈ డాక్యుమెంటరీలో పాకిస్తాన్ సైనికులు చేసిన మారణహోమం, కొత్త దేశం ఆవిర్భావానికి దారితీసిన విముక్తి యుద్ధాన్ని చిత్రీకరించారు.

ప్రముఖుల సంతాపం..

గీతా మెహతా మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ, పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. గీతా మెహతా బహుముఖ వ్యక్తిత్వం కలిగిన మహిళగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆమె మరణం అత్యంత బాధాకరమన్నారు. గీతా మెహతా మృతి పట్ల రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్, కేంద్ర విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

గ్రామీణ సమస్యలు వెలుగులోకి తేవాలి



ది లాస్ట్ హీరో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పి.సాయినాథ్

జయపురం: దేశంలో అత్యధిక జనాభా గ్రామీణ ప్రాంతాల్లో నివాసముంటున్నారని, వారు అనేక సమస్యలతో సతమతమౌతున్నారని, వాటిని వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యత మీడియాపై ఉందని ప్రముఖ పాత్రికేయుడు పి.సాయినాథ్ అన్నారు. ఆదివారం జయపురం వచ్చిన ఆయన స్థానిక అన్నపూర్ణ భవన్‌లో ఆయన రచించిన 'ది లాస్ట్ హీరోస్ (ఫుట్ సోల్జర్స్ ఆఫ్ ఇండియన్ ఫ్రీడమ్) పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చాలా గ్రామీణ ప్రాంతాలకు నేటికీ వార్తా పత్రికలు చేరడం లేదన్నారు. చాలా పత్రికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వార్తలకే ప్రాధాన్యమిస్తున్నారు తప్ప సామాన్యులను పట్టించుకోవడం లేదన్నారు. ఈ పరిస్థితి మారాలన్నారు. ప్రభుత్వం అనేక మంది స్వాతంత్ర్యయోధులను విస్మరించిందని, వారి గురించి ప్రజలకు తెలియజేయాలన్న సంకల్పంతో 'ది లాస్ట్ హీరోస్' పుస్తకం రాశానని వెల్లడించారు. 2001లో ప్రారంభిస్తే ఇప్పటికి పూర్తయిందన్నారు. ఇందులో 15 మంది స్వాతంత్ర్య యోధుల చరిత్ర ఉందని, వారిలో 9 మంది ఒడిశా రాష్ట్రం వారేనని తెలిపారు. అవిభక్త కొరాపుట్ జిల్లా స్వాతంత్ర్యయోధుడు మహమ్మద్ బాజీ, లక్ష్మీ పండా తదితరుల వివరాలు పొందుపరిచినట్లు వివరించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు పురుషోత్తమసంగ్ ఠాకూర్, జర్నలిస్ట్ రచయిత డాక్టర్ పరేష్ రథ్ పాల్గొన్నారు.

మొబైల్ హెల్త్ యూనిట్లు ప్రారంభం



వాహనాలను ప్రారంభిస్తున్న మంత్రి సరక, ఎమ్మెల్యే ముదులి

రాయగడ: జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు మరిన్ని వైద్య సేవలను అందించేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి మంజూరు చేసిన రూ.25 లక్షలతో కొనుగోలు చేసిన రెండు మొబైల్ హెల్త్ వాహనాలను ఆదివారం రాష్ట్ర ఆదివాసీ, ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. జిమిడిపేట, కాసీపూర్ సీహెచ్‌సీల పరిధిలో ఇవి సేవలందిస్తాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లోనూ సకాలంలో వైద్యసేవలు అందించేందుకు దృష్టి సారించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ రౌత్రాయ్, స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్ అనసూయా మాఝి, బిజు స్వస్థ్య సమితి ముఖ్యసలహాదారుడు సుధీర్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

కొరాపుట్ కాపు కుటుంబం నూతన కార్యవర్గ ఎన్నిక



నూతన కార్యవర్గమిదే..

జయపురం: కొరాపుట్ జిల్లా కాపు కుటుంబం నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. స్థానిక టౌన్ హాలులో జరిగిన ఈ ఎన్నికలో అధ్యక్షునిగా ఎస్.భాస్కరరావు, జనరల్ సెక్రటరీగా కె.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా ఎం.ఆదినారాయణ, బి.నరేష్, సహాయ కార్యదర్శులుగా పి.జగదీష్, ఎం.ఈశ్వరరావు, కోశాధికారిగా బి.రమేష్, కార్యవర్గ సభ్యులుగా ఎం.సర్వేశ్వరరావు, పి.తిరుపతి, జి.శివ, పి.శ్రీనివాస్, జి.వెంకటరమణ, జి.మన్మథరావు, సీహెచ్.ఆదినారాయణ, ఎస్.భవాని, కె.గోపాలరావు, కోటేశ్వరరావు, వై.ప్రసాద్, ఆర్.బాసు, ఎస్.శివ, డి.అప్పారావులను ఎన్నుకున్నారు. న్యాయ సలహాదారులుగా న్యాయవాది కె.ప్రసాదరావు, సలహాదారులుగా పి.భాస్కరరావు, ఎం.శంకరరావు, కె.దుర్గారావు, దాసరి నానాజీలు నియమితులయ్యారు.

క్లుప్తంగా

తగులు మిగులతో చవితి పూజలు


వినాయక విగ్రహాలు

పర్లాకిమిడి: ఒడిశాలో సోమవారం ఇళ్లల్లో విఘ్నేశ్వర పూజ నిర్వహిస్తుండగా, ప్రభుత్వ కార్యాలయాలకు మాత్రం ప్రభుత్వం మంగళవారం సెలవు ప్రకటించింది. దీంతో చాలాచోట్ల మండపాల్లో మంగళవారం నుంచే పూజలు ప్రారంభం కానున్నాయి. తగులు మిగులు పడటంతో ఈ పరిస్థితి ఏర్పడిందని పండితుడు వనమాలి మణిశర్మ తెలిపారు.

ఘనంగా మోదీ జన్మదిన వేడుకలు


కాశీనగర్ బ్లాక్ శియ్యాళి గ్రామంలో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

పర్లాకిమిడి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 74వ పుట్టిన రోజు సందర్భంగా కాశీనగర్ సమితి శియ్యాళి, ఖండవ గ్రామాల్లో భారతీయ జనతా పార్టీ కృషక్ మోర్చా అధ్యక్షుడు ప్రశాంత పాలో, జిల్లా యువమోర్చా నాయకులు కోట్ల యువరాజ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కాశీనగర్ బీజేపీ కార్యకర్తలు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

టెక్కలి రూరల్: పట్టలసరియా గ్రామంలో గణేష్ మండపం ఏర్పాటు విషయంలో తలెత్తిన గొడవలో ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు ఆదివారం తెలిపారు. ఈ గ్రామంలో ఏటా వినాయకుడి మండపం ఏర్పాటు చేసే స్థలంలో గండేటి భీమారావు తెలుగుదేశం పార్టీ జెండాను ఏర్పాటు చేశారు. అయితే గ్రామానికి చెందిన కొంత మంది యువకులు మండపం పనులకు అడ్డంగా ఉందనే ఉద్దేశంతో ఆ జెండాను పక్కకు మార్చారు. అది గుర్తించిన భీమారావు, అతని కుమారుడు, భార్య ఒక్కసారిగా యువకులపై దాడిచేశారు. దీంతో గాయాలకు గురైన సార అప్పయ్యతో పాటు మరికొంత మంది యువకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

జిల్లా ఖోఖో సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా ఖోఖో అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. జిల్లా చైర్మన్‌గా పొన్నాడ రవికుమార్ ఎన్నికకాగా, జిల్లా అధ్యక్షునిగా వరుసగా మరోసారి చిట్టి నాగభూషణంను ఏగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీకాకుళం నగరంలోని బలగ హాస్పటల్ జంక్షన్ సమీపంలో ఉన్న భరాతి ఐటీసీ ప్రాంగణంలో జరిగిన సర్వసభ్య సమావేశం అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నా రు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులు పరిశీకులుగా, ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.


నూతన కార్యవర్గం

జిల్లా ఖోఖో అసోసియేషన్ చైర్మన్‌గా పొన్నాడ రవికుమార్, చీఫ్ ప్యాట్రన్‌గా బాన్న పవన్‌కుమార్, జిల్లా అధ్యక్షునిగా చిట్టి నాగభూషణం, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ ఫల్గుణరావు, కోశాధికారిగా బాడాన నారాయణరావు, ఉపాధ్యాక్షులగా బి.తిరుమలరావు, జీఎం జ్యోతి రాణి పి.రామకృష్ణ, సంయుక్త కార్యదర్శులగా ఎం.నీలాద్రిరావు, టి.మురళీమోహనరావు, ఆర్‌వీ రత్నం, కార్యవర్గ సభ్యులుగా కె.తిరుపతిరావు, ఎస్.పార్వతి, డి.కిషన్‌కుమార్, జె.ప్రదీప్‌కుమార్ ఎన్నికయ్యారు.


'పాత గీతాలు మధురమైనవి'

శ్రీకాకుళం కల్చరల్: పాత పాటలు ఆపాతమధురాలని, అవి చిరస్థాయిగా నిలిచి ఉంటాయని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో విశాఖకు చెందిన నారీభేరీ సంస్థ సుకుమార్ ఆర్కెస్ట్రా సంయుక్త నిర్వహణలో ఘంటసాల, ఎస్పీ బాలు సినీ సంగీత విభావరి ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. నిర్వాహకులు ఎంతో విశేషమైన ప్రతిభ కలిగిన వారు కావడంతో చక్కనైన గీతాలను వీనుల విందుగా ఆలపించారన్నారు. అనంతరం మంత్రి ధర్మాన కళాకారులను సంస్థ తరఫున సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, కళాప్రవీణ బందారు చిట్టిబాబు, డాక్టర్ నిక్కు అప్పన్న, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి, నారీ భేరీ ప్రతినిధులు కింతలి భాగ్యలక్ష్మి, సీవీ రాజేశ్వరి, శైలజ మొరాజ్, కొంక్యాణ గోవింద రాజులు చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు కొంక్యాన వేణుగోపాల్, మండవిల్లి రవి పాల్గొన్నారు. మధురమైన గీతాలను కెఎల్ఎన్ మూర్తి, రాజమోహన్, హేమచంధర్, శ్రీనివాసరావు, భాగ్యలక్ష్మీ, కూర్మారావు, శైలజ, నాగభూషన్, పండరికుమార్ తదితరులు వీనుల విందుగా పాడారు.

విశ్వకర్మకు విశేష పూజలు


రాయగడ: పూజలందుకుంటున్న విశ్వకర్మ


పర్లాకిమిడి: రోడ్లు-భవనాల శాఖ మెకానికల్ సెక్షన్ వద్ద విశ్వకర్మ పూజలు


కొరాపుట్: పట్టణంలో విశ్వకర్మ మండపం


నబరంగ్‌పూర్ జిల్లాలో భవన నిర్మాణ కార్మికులు ఏర్పాటు చేసిన విశ్వకర్మ విగ్రహం

పర్లాకిమిడి: పట్టణంలో విశ్వకర్మ పూజలు ఆదివారం ఘనంగా జరిగాయి. స్థానిక పర్లాకిమిడి రోడ్లు-భవనాల శాఖ మెకానికల్ డివిజన్, లేత్ మెషిన్ వర్కర్లు, ఇరిగేషన్ శాఖ కార్యాలయాల్లో విశ్వకర్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమ్మరి, కంసాలి, వడ్రంగి తదితర చేతివృత్తుల వారు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

కొరాపుట్‌లో..

కొరాపుట్: విశ్వకర్మ పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లోని ప్రజా ఆరోగ్య శాఖ, లిఫ్ట్ ఇరిగేషన్, విద్యుత్, అగ్ని మాపక, రోడ్ల భవనాలు కార్యాలయాలలో విశ్వకర్మ విగ్రహాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టెలికాం, రైల్వే, భూగర్భ నీటి వనరుల కార్యాలయాల్లో విశేష పూజలు జరిగాయి. కొరాపుట్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన భారీ మండపాలు ఆకర్షణగా నిలుస్తున్నాయి. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘ కార్యాలయంలో విశ్వ కర్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యుత్ అలంకరణలో..

రాయగడ: పట్టణంలోని బ్లాక్ కాలనీ, విద్యుత్ లైన్ కాలనీల్లో విశ్వకర్మ పూజలు ఘనంగా నిర్వహించారు. విద్యుత్ దీపాల అలంకరణలతొ పూజా మండపాలు ఆకట్టుకుంటున్నాయి. ఉదయం ఆహ్వాన పూజలతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

గుర్తించదగిన వ్యాధిగా హ్యూమన్ రేబిస్

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం హ్యూమన్ రేబిస్‌ను నోటిఫై (గుర్తించదగిన) చేయదగిన వ్యాధిగా ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రేబిస్ అనే వైరల్ వ్యాధి తరచుగా మానవ మరణాలకు కారణమవుతుందని పేర్కొంది. రేబిస్ ఘటనలు కుక్క – సంబంధిత సంక్రమిత ప్రామాణికలపై విమర్శనాత్మకంగా ఆధారపడి ఉంటుంది. రేబిస్‌లో 99 శాతం వరకు కుక్క కాటు వల్లే సంక్రమిస్తుంది. రేబిస్ ప్రాణాంతకం అయినప్పటికీ, సకాలంలో, తగిన పోస్ట్-ఎక్స్‌పోజర్ ప్రొఫిలాక్సిస్ (పీఈపీ) ద్వారా దీనిని నివారించవచ్చు. 2030 నాటికి రేబిస్ నిర్మూలన కోసం ప్రపంచ వ్యాప్తంగా ఉద్యమం ఊపందుకుంటోంది. జాతీయ రేబిస్ నియంత్రణ కార్యక్రమం (ఎన్‌ఆర్‌సీపీ) దేశంలో రేబిస్ నిఘా సమస్యలు, సవాళ్లను పరిష్కరించడానికి అమలు చేస్తున్నారు. రేబిస్ కేసులను సంబంధిత ఆసుపత్రులు, క్లినిక్‌లు, పాలీ క్లినిక్‌లు, నర్సింగ్ హోమ్‌లు, మెడికల్ కాలేజ్, ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ క్లినిక్‌లు, ఎన్జీవో సెక్టార్ ఆసుపత్రులు, మున్సిపాలిటీ ఆసుపత్రులు, అర్బన్ ఏరియా ఆసుపత్రులు నిర్ధారిత నమూనా ప్రకారం జిల్లా ప్రధాన వైద్యాధికారి (సీడీఎంఓ), ప్రజారోగ్య అధికారులు (పీహెచ్ఓ), జిల్లా ప్రజారోగ్య అధికారులు (డీపీహెచ్ఓ) సహా జిల్లా ఆరోగ్య అధికారుల దృష్టికి తీసుకురావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సేవలకు సత్కారం


బసంత్ రాణాను సత్కరిస్తున్న ప్రధాని మోదీ

భువనేశ్వర్: న్యూఢిల్లీలో విశ్వకర్మ యోజన ప్రారంభించిన సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం పూరీ జగన్నాథ ఆలయ సేవకుడు బసంత్ రాణాను సత్కరించారు. ఈయన ఆలయంలో వివిధ సందర్భాలలో జగన్నాథుని అలంకరణకు సరంజామా సిద్ధం చేస్తారు. రథయాత్ర, నాగార్జున అలంకారం, పద్మ అలంకరణ వంటి ప్రత్యేక సందర్భాల్లో పూలు, వస్త్రం, జీలుగు వంటి పదార్థాలతో శ్రీ జగన్నాథుని సుందరంగా ముస్తాబు చేస్తారు. శ్రీ మందిరంలోని రత్న వేదికపై మూల విరాట్లకు నిత్య ఆచార వ్యవహారాల్లో అవసరమైన పూల దండలను తయారుచేస్తారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన సందర్భంగా స్వామికి తులసి ఆకులతో చేసిన భారీ దండను సమర్పించారు. ఈ సందర్భంగా సత్కార గ్రహీత మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన విశ్వకర్మ పథకం ద్వారా అందిస్తున్న ఆర్థిక ప్రయోజనాలు వారసత్వ వృత్తిని అభ్యసిస్తున్న కళాకారులకు ప్రోత్సాహకరంగా ఉంటుందని పేర్కొన్నారు. విశ్వకర్మ పథకం కింద ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ ఇస్తుంది. ట్రైనీలకు రూ.500 ప్రోత్సాహకం, రూ. 1,500 విలువైన పరికరాల కొనుగోలుకు ఓచర్ అందిస్తుంది.

విశ్వకర్మ యోజనతో మేలు


పథకం ప్రాముఖ్యతను వివరిస్తున్న ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు

పర్లాకిమిడి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 74వ పుట్టిన రోజు వేడుకలు స్థానిక బీజేపీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పీఎం విశ్వకర్మ యోజన ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు భారీ తెరపై వీక్షించారు. జిల్లాలోని చేతి వృత్తుల కళాకారులు, కమ్మరి, కంసాలి, కుమ్మరి, నేత, ఆర్టిస్టులు, వడ్రంగి ఇతర వెనుకబడిన తరగతులకు విశ్వకర్మ పథకం ద్వారా రూ.15వేల నగదు, పనిముట్లు, లక్ష నుంచి మూడు లక్షల రూపాయల వరకు రుణం పొందే అవకాశం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ అవకాశాన్ని చేతివృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాశీనగర్ బీజేపీ నాయకులు ఛిత్రి సింహాద్రి, దుల్లు మిశ్రా, కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఏకఛత్రాధిపత్య పాలన


బీజేపీ కార్యకర్తల బైక్ ర్యాలీ

జయపురం: రాష్ట్రంలో ఏక ఛత్రాధిపత్య పాలన సాగుతోందని బీజేపీ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ విమర్శించారు. కొరాపుట్ జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం జయపురంలో బీజేపీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముందుగా బీజేపీ కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు సుమంత ప్రధాన్ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో సామల్ ప్రసంగించారు. 'మో మట్టి మో దేశ' కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం కోట్లాది రూపాయలు కేటాయిస్తున్నా ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లిస్తోందన్నారు. ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు బనాయిస్తూ జైలుకు పంపుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం శిథిలమైందన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రులు కనిపించడం లేదని విమర్శించారు. జయపురంలో నేటికీ 'జాగా మిషన్' కార్యక్రమం ప్రారంభం కాలేదన్నారు. కేంద్రం ప్రభుత్వం అటవీ ఉత్పత్తుల ధరలు పెంచటం వల్లే ఆదివాసీల ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందన్నారు. ఉడాన్ పథకంలో భాగంగా భువనేశ్వర్- జయపురం- విశాఖపట్నంలకు విమాన సౌకర్యం కలిగిందని గుర్తు చేశారు. సమావేశంలో బీజేపీ ఉపాధ్యక్షుడు బిరంచి నారాయణ త్రిపాఠీ, రాష్ట్ర కార్యదర్శి సరోజ్‌కర్, పూర్ణిమ నాయిక్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ బీజేపీ మోర్చా రాష్ట్ర సాధారణ కార్యదర్శి కాశీరాం మఝి, మాజీ ఎంపీ బలభద్ర మఝి, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ శాశ్వత సభ్యులు గౌతమ సామంత రాయ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ అధ్యక్షుడు మన్మోహన్ సామల్

ప్లాస్టిక్ రహిత గంజాం లక్ష్యంగా..


గోపాల్‌పూర్ తీరంలో చెత్త తొలగిస్తున్న విద్యార్థులు, అధికారులు


ఉత్సాహంగా పాల్గొన్న కళాశాలల విద్యార్థులు

బరంపురం : గంజాం జిల్లాను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా కోరారు. ఆదివారం గోపాల్‌పూర్ తీరంలో గంజాం జిల్లా పాలన యంత్రాంగం ఆధ్వర్యంలో 'మో స్వాభిమాన్ స్వాచ్ఛ గంజాం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ 30 వరకు గంజాం జిల్లా వ్యాప్తంగా 'మో స్వాభిమాన్ స్వాచ్ఛ గంజాం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం అధికారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కలిసి చెత్తాచెదారాలను తొలగించారు. పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దారు.

కొత్తూరులో భారీ వర్షం


కొత్తూరులో కురుస్తున్న వాన

కొత్తూరు: కొత్తూరు మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి భారీ వాన కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. సుమారు గంటన్నర పాటు కురిసిన వర్షానికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వినాయక చవితి కావడంతో మార్కెట్‌లో పండ్ల దుకాణదారులతో పాటు వినాయక విగ్రహాలు విక్రయిస్తున్న వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. వినాయక మండపాల ఏర్పాటుకు కూడా వాన విఘాతం కలిగించింది.

కంప్యూటర్ సెంటర్ ప్రారంభం


కంప్యూటర్ శిక్షణలో విద్యార్థులు

మల్కన్‌గిరి : జిల్లాలోని ఖోయిర్‌పూట్ సమితి బొండఘాటీ ముదిలీపోడ పంచాయతీలో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ సెంటర్‌ను ఆదివారం ఎస్పీ నితీష్ వాద్వానీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన యువతలో చైతన్యం కల్పించేందుకు సెంటర్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. 10 కంప్యూటర్లు ఏర్పాటు చేశామని, మొదటి బ్యాచ్‌లో 50 మందికి శిక్షణ అందిస్తామని చెప్పారు. ప్రస్తుతానికి పోలీసులే శిక్షణ అందిస్తారని, త్వరలోనే కంప్యూటర్ టీచర్‌ను నియమిస్తామని తెలిపారు

గోపాల్‌పూర్ పోర్టులో డ్రెడ్జింగ్ పనులు


గోపాల్‌పూర్ పోర్టులో మూసుకుపోయిన ముఖ ద్వారాన్ని జేసీబీతో తెరుస్తున్న దృశ్యం

బరంపురం : గోపాల్‌పూర్ తీరంలో డ్రెడ్జింగ్ పనులు ఊపందుకున్నాయి. గోపాల్‌పూర్ పోర్ట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో సముద్ర నీటి మట్టం పెరిగింది. అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతుండటంతో గోపాల్‌పూర్ ఉప్పుటేరు ముఖద్వారం ముసుకుపోయింది. ఫలితంగా పోర్టు పనులకు అంతరాయం కలుగుతోంది. దీంతో పోర్టు యాజమాన్యం ఆదివారం డ్రెడ్జింగ్ పనులు చేపట్టింది. భారీ జేసీబీలతో పనులు చేపట్టారు.


గోపాల్‌పూర్ పోర్టులో జేసీబీ యంత్రాలు


ఓడరేవుకు వచ్చిన మలేషియా ఓడ

ప్రజారోగ్యానికి ప్రాధాన్యత

- జగనన్న ఆరోగ్య సురక్షలో ఇంటింటా ముమ్మర సర్వే
- జిల్లాకు ముగ్గురు పర్యవేక్షణ అధికారులు
- వైద్యారోగ్య శాఖలో చరిత్రాత్మక కార్యక్రమానికి శ్రీకారం



జలుమూరు, బూర్జ: ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఒక వైపు ఆరోగ్యశ్రీ, మరో వైపు ఫ్యామిలీ డాక్టర్ వైద్యం అందిస్తూనే జగనన్న ఆరోగ్య సురక్ష పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే ఇంటింటా సర్వే ముమ్మరంగా జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఈ సర్వే పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు ముగ్గురు పర్యవేక్షణ అధికారులను కూడా నియమించింది. దీనికి తోడు నియోజకవర్గాలకు కూడా వైద్యాధికారులను పర్యవేక్షణ కోసం ప్రభుత్వం నియమించింది. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అధికారులు దిశానిర్దేశం చేస్తున్నారు.

మండలాల్లో వైద్యశిబిరాలు..

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలాల వారీగా ఈ నెల 30 నుంచి మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తారు. ప్రతి శిబిరంలో ఇద్దరు వైద్యులు ఉంటారు. వీరితోపాటు 104 వైద్యులు అందుబాటులో ఉంటారు. ఒక మండలంలో ఎన్ని హెల్త్ క్లినిక్స్ ఉన్నాయో ఆ పరిధిలో గుర్తించిన రోగులందరికీ ఆ రోజు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందజేస్తారు. హెల్త్ శిబిరాల నిర్వహణలో ఎంపీడీఓ, తహసీల్దార్‌తో పాటు అన్ని శాఖల అధికారులు పాల్గొంటారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతోపాటు జబ్బులకు గుర్తించడం ఒక పనయితే, వారికి చికిత్స చేసేందుకు రిఫరల్ చేయడం రెండో అంశం. ఈ రెండు అంశాలే కీలకం. దీనికి తోడు ఈ శిబిరాల్లో దీర్ఘకాలిక వ్యాధులైన షుగర్, కేన్సర్, గుండె, కిడ్నీ, బీపీ వంటి సమస్యలకు చికిత్స అందజేస్తారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. సర్వేలో ఆరోగ్య కార్యకర్త, కమ్యూనిటీ హెల్త్ ఆధికారి సంయుక్తంగా గ్రామంలో ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబంలో ప్రతి ఒక్కరికీ పరీక్షలు నిర్వహిస్తారు. వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ జరిగితే ఆ రోగికి ఒక ఐడీ నంబర్‌తోపాటు కేస్ షీటు ఇస్తారు. ఆ వ్యాధి సంబంధిత స్పెషలిస్టు వద్ద వైద్యం తీసుకోవచ్చు.

చరిత్రాత్మక కార్యక్రమం



ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ చరిత్రలో ఎన్నడూ ఇలాంటి కార్యక్రమాలు జరగలేదు. గతంలో సాధారణంగా వైద్య శిబిరాలు మాత్రమే నిర్వహించేవారు. ఈ సారి మాత్రం వైద్య శిబిరాలకు 15 రోజులు ముందుగానే ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి అర్హులైన వారికి నెట్‌వర్క్ ఆస్పత్రులతోపాటు స్పెషలిస్ట్ వైద్యులను కోరుకునే ప్రత్యేక అవకాశం కల్పించడం జరుగుతుంది. – బి.మీనాక్షి, డీఎంహెచ్ఓ

జిల్లా అధికారులు వీరే..

జిల్లా అధికారులుగా డీఎంహెచ్ఓ బొడ్డేపల్లి మీనాక్షి, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ టీబీ అధికారి అనురాధ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఆర్‌వీఎస్ కుమార్‌లు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు.

నియోజకవర్గాలకు..

ఇచ్ఛాపురం:	డాక్టర్ పి.శ్రీదేవి
పలాస:	డాక్టర్ జీవీ లక్ష్మి
టెక్కలి:	డాక్టర్ ఎం.ప్రసాదరావు
పాతపట్నం:	డాక్టర్ పీవీ సత్యనారాయణ
అర్బన్ హెల్త్ సెంటర్లు(శ్రీకాకుళం, ఆమదాలవలస, పలాస, ఇచ్ఛాపురం) :	డాక్టర్ పి.వి లింగరాజు
ఆమదాలవలస:	జి.సన్యాసిరావు
ఎచ్చెర్ల:	కె.రవి ప్రసాద్
నరసన్నపేట:	డాక్టర్ ప్రవీణ్
శ్రీకాకుళం:	శ్రీనివాసరావు

వీరితో పాటు మండలాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం పర్యవేక్షణ చేసేందుకు ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సీనియర్ వైద్యులను 30 మండలాలకు 30 మందిని నియమించారు. వీరు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి రోజువారీ నివేదికలను తెప్పించుకుని జిల్లా వైద్యాధికారితో సమన్వయం చేసుకుంటారు.

క్లుప్తంగా

చెరువులోకి దూసుకెళ్లిన కారు



చేపల చెరువులో పడిన కారు

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామ సమీపంలోని చేపల చెరువులోకి ఓ కారు దూసుకెళ్లింది. అదృష్టవశాత్తు అందులోని ప్రయాణీకులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. పాలకొండ నుంచి రాజాం వైపు వస్తున్న కారు అదుపుతప్పి, చెరువులో పడిపోయింది. స్థానికుల సహాయ సహకారాలతో ప్రొక్లెయినర్ సహాయంతో కారును బయటకు తీశారు.

గాయత్రి మంత్రానికి మించినదేదీ లేదు..



ఆధ్యాత్మిక ప్రవచనం చెబుతున్న స్వప్నహైందవి

విజయనగరం టౌన్: గాయత్రి మంత్రానికి మించినదేదీ లేదని రాజాం ప్రభుత్వం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.స్వప్నహైందవి అన్నారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో టీటీడీ భక్తభజన మండలి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం ఆదివారం రాత్రి నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వేదం అంటే జ్ఞానమని, వేదాన్ని ఎవరైతే ఆచరిస్తారో ఆ వేదం వారిని రక్షిస్తుందన్నారు. మానవజాతికి బ్రహ్మజ్ఞానం తెలుసుకునే మార్గాలను మన మహర్షులు తెలిపారన్నారు. అనంతరం భక్త భజన మండలి ప్రతినిధులు ఆమెను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.

లిఖిత్‌కు ఎమ్మెల్యే చేయూత



లిఖిత్‌కు క్రికెట్ కిట్, నగదు అందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: ఆంధ్రప్రదేశ్ బధిరుల క్రికెట్ అసోసియేషన్ 7వ టి-20 క్రికెట్ చాంపియన్‌షిప్‌కు జిల్లా నుంచి ఎంపికైన భోగాపురం మండలం సుందరపేట గ్రామానికి చెందిన కట్టిరెెట్టి లిఖిత్‌కు నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చేయూత అందించారు. మోపాడలోని ఎమ్మెల్యే తన స్వగృహంలో లిఖిత్‌కు క్రికెట్ కిట్‌తో పాటు రూ.10 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుందర హరీష్, పడాల శ్రీను, గోపి, సుందర వెంకటన్న, ఎంపీటీసీ సభ్యుడు బంగారాజు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత..

భోగాపురం మండలంలోని కొయ్యపేట గ్రామానికి చెందిన బాకి సూరమ్మకు రూ.5 లక్షల వైఎస్సార్ బీమా మంజూరుపత్రాన్ని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అందజేశారు. బాకి సూరమ్మ భర్త ప్రమదవశాత్తూ మరణించారు. దీంతో వైఎస్సార్ బీమా మంజూరైంది.

ఘనంగా విశ్వకర్మ జయంతి

విజయనగరం: విశ్వకర్మ జయంతి ఉత్సవాలు నగరంలో ఆదివారం ఘనంగా జరిగాయి. సంప్రదాయరీతిలో విశ్వకర్మ విగ్రహాలను నెలకొల్పారు. స్థానిక రామారాయుడు రోడ్‌లో నిర్వహించిన విశ్వకర్మ జయంతి ఉత్సవాలలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొని ప్రత్యేక పూజలు చేశా రు. అలాగే నాలుగో డివిజన్‌లో బధిర పాఠశాల ప్రాంతంలో నెలకొల్పిన విశ్వకర్మ జయంతి వేడుకల్లో కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మారో జు శ్రీనివాసరావు మాట్లాడుతూ, విశ్వకర్మ జయంతిని అధికారిక పండగగా నిర్ణయిస్తూ ప్రభుత్వం జీఓ 24 విడుదల చేయడం ఆనందంగా ఉందన్నా రు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జనాప్రసాద్, ముక్కామల శ్రీనివాసరావు, వరాహాచారి, పెదగాడ ప్రసాదు, కొండపల్లి అప్పారావు, బంగారు దేవుడు, ఎ.రవి, మానేపల్లి భవాని, కె.పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత..

పూసపాటిరేగ: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని పాత జాతీయ రహదారి వద్ద ఏర్పాటు చేసిన విశ్వకర్మ జయంతిలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మహంతి శ్రీనివాసరావు, మహంతి లక్ష్మణరావు, టొంపల సీతారాం, పాల్గొన్నారు.

30లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

వంగర: ఇంటర్మీడియట్‌లో 2022-23 విద్యాసంవత్సరంతో పాటు అంతకుముందు ఇంటర్‌లో ఫెయి ల్ అయిన విద్యార్థులు ఈ నెల 30వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని మద్దువలస ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొరటాన నారాయణరావు తెలిపారు. అలాగే మధ్యలో చదువు నిలిపివేసిన విద్యార్థులకు కూడా ఫీజు చెల్లించి పరీక్షలు రాసేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందన్నారు. వీరంతా 2024 మార్చిలో జరగనున్న ఇంటర్ పరీక్షలు రాసేందుకు అర్హులని తెలిపారు. 2017 నుంచి 2019వ సంవత్సరం వరకు ఎన్.ఎస్.ఎస్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు కళాశాల కు వచ్చి సర్టిఫికెట్లు తీసుకోవాలని కోరారు.

మరింత నాణ్యంగా.. రుచిగా..

- వసతిగృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం
- డైట్‌చార్జీలు పెంచిన రాష్ట్ర ప్రభుత్వం
- జిల్లాలోని 100 వసతిగృహాల్లో 9,392 మందికి లబ్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థిలోకం



గంట్యాడ ఎస్సీ హాస్టల్‌లో భోజనం చేసేముందు ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

నెల్లిమర్ల: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. ఇప్పటికే మనబడి నాడు-నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను సమూలంగా మార్చివేసింది. అలాగే ఇప్పుడు వసతిగృహ విద్యార్థుల సమస్యలపై కూడా ప్రత్యేక దృష్టి సారించింది. ఇంటి వాతావరణాన్ని తలపించేలా పసందైన భోజనాన్ని అందించేందుకు డైట్‌చార్జీలను పెంచింది. సరికొత్త మెనూ అమలు చేస్తోంది. గతంలోని టీడీపీ ప్రభుత్వం వసతిగృహాలను అంతగా పట్టించుకోకపోవడంతో వాటి నిర్వహణ పూర్తిగా చతికిలపడింది. విద్యార్థులకు మెనూ ప్రకారం సక్రమంగా భోజనం అందిన సందర్భాలు లేవు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వసతిగృహాల్లో మౌలిక సౌకర్యాలు మెరుగుపడ్డాయి. విద్యార్థులకు బలవర్థకమైన పౌష్టికాహారం అందేలా చేయడంతో పాటు నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో ఉండేలా చేసింది. విద్యార్థులు చదువులో చురుగ్గా రాణించాలంటే వారి ఆరోగ్యం బాగుండాలని గుర్తించిన ప్రభుత్వం విద్యార్థుల డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచింది. ఈ పెరిగిన చార్జీలతో వసతిగృహాల్లోని విద్యార్థులకు రుచికరమైన భోజనం అందుతోంది. దీనిపట్ల విద్యార్థి లోకం హర్షం వ్యక్తం చేస్తోంది.

బలవర్థకమైన మెనూ..

ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న మెనూతో వసతిగృహాల విద్యార్థులకు బలవర్థకమైన ఆహారం అందుతోంది. చికెన్‌బిర్యానీ, పూరీ, ఇడ్లీ, జీరా రైస్, ఉప్మా సేమియా, పాయసం, రసం, టమాటా బాత్, ఎగ్ టమాటా కర్రీ, చికెన్‌కర్రీ లాంటి వంటకాలతో మూడు పూటలా రుచికరంగా తింటున్నారు.

జిల్లాలో వసతిగృహాలు ఇలా..

జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖలో ప్రీ మెట్రిక్ హాస్టల్స్, పోస్ట్‌మెట్రిక్ హాస్టల్స్ 30 ఉండగా, వాటిలో 1920 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. అలాగే బీసీ సంక్షేమ వసతిగృహాలు ప్రీ మెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ హాస్టల్స్ కలిపి మొత్తం 53 ఉండగా, అందులో 3,519 మంది విద్యార్థులుంటున్నారు. గిరిజన వసతిగృహాలు ప్రీమెట్రిక్ 8, పోస్ట్ మెట్రిక్ 9 మొత్తం 17 ఉండగా, అందులో 3,952 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. హాస్టల్ సౌకర్యాలు మెరుగుపడడడంతో పాటు మెస్(డైట్) చార్జీలు కూడా పెరగడంతో అడ్మిషన్లు కూడా అధికంగా పెరిగాయని అధికారులు చెబుతున్నారు.

గతంలో అలా.. ప్రస్తుతం ఇలా..

గత ప్రభుత్వంలో వసతిగృహాల్లో నీళ్లచారు.. ఉడకని అన్నం, రుచిలేని కూర, కనిపించని గుడ్డుతో భోజనం అధ్వానంగా ఉండేది. డైట్ చార్జీలు అరకొరగా ఇచ్చేవారు. పర్యవేక్షణ కూడా కరువై మెనూ సక్రమంగా అమలయ్యేది కాదు. విద్యార్థులు అర్ధాకలితో అలమటించేవారు. ప్రస్తుతం వారంలో ఏడు రకాల అల్పాహారం, మూడు రోజులు చికెన్‌కర్రీ, ప్రతిరోజూ ఉడకబెట్టిన గుడ్డు, ఉదయం పాలు, వేరుశనగ చిక్కీ, రాత్రి భోజనం అనంతరం అరటిపండు ఇస్తున్నారు. హాస్టల్లో మెనూ పక్కాగా అమలవుతోంది. డైట్ చార్జీలు పెరగడంతో విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన పౌష్టికాహారం అందుతోంది.

తోటపల్లి కాలువలో జారిపడి వ్యక్తి మృతి



జగన్‌మోహన్‌రావు (ఫైల్)

బాడంగి: ప్రమాదవశాత్తు తోటపల్లి కాలువలో జారిపడి గొట్టాపు జగన్‌మోహన్ రావు(47) అనే వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని జీకేఆర్ పురానికి చెందిన ఆయన పిల్లల చదువుల నిమిత్తం తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి బొబ్బిలి పూల్‌బాగ్ కాలనీలో నివాసముంటున్నారు. వినాయక చవితి పండగ కోసమని స్వగ్రామం శనివారం వచ్చిన ఆయన ఆదివారం ఉదయం బహిర్భూమి కోసం గ్రామం పక్కనే ప్రవహిస్తున్న తోటపల్లి కాలువ వద్దకు వెళ్లి, కాలుజారి అందులో పడిపోయాడు. ఈతరాకపోకవడంతో ఊపిరాడక చనిపోయాడు. ఎంతసేపటికి ఆయన ఇంటికి రాకపోవడంతో కాలువ వద్దకు వెళ్లి, కుటుంబ సభ్యులు గాలించగా, ఆయన మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆర్.జయంతి తెలిపారు.

చికిత్స పొందుతూ..

కొత్తవలస: విశాఖలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మండలంలోని కొత్తవలస గ్రామానికి చెందిన కె.నర్సుమాంబ(64) ఆదివారం మృతి చెందినట్లు ఏఎస్‌ఐ రాజులు తెలిపారు. ఈ నెల 14వ తేదీన కొత్తవలస రైల్వేస్టేషన్ సమీపంలో నర్సుమాంబ తన భర్త ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, వారి వెనక నుంచి వచ్చిన ఆటో వారిని బలంగా ఢీకొనడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. అదేరోజు చికిత్స నిమిత్తం విశాఖపట్నం తరలించగా, చికిత్స పొందుతూ చనిపోయినట్లు వెల్లడించారు.

రైలు ఢీకొని..



ఆస్పత్రిలో నరేష్ మృతదేహం

పార్వతీపురం టౌన్: గూడ్సురైలు ఢీకొని తాబేలు నరేష్(30) అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ దుర్ఘటన మండలంలోని నర్సిపురం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. నర్సిపురానికి చెందిన ఈయన ట్రాక్టర్ డ్రైవర్ కాగా, రైల్వేగేటు దాటుతుండగా మృత్యువాతకు గురైనట్లు రైల్వే పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి మృతదేహం తరలించారు.

అనుమతి తప్పనిసరి

బాడంగి: వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించేవారు తప్పనిసరిగా పోలీస్ అనుమతి తీసుకోవాలని ఎస్సై ఆర్. జయంతి అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆమె మాట్లాడుతూ, మంటప నిర్వాహకులు ఎన్ని రోజులు ఉత్సవం నిర్వహిస్తారో తెలియజేయాలన్నారు. నిమజ్జనం వివరాలు కూడా ముందు గా తెలియజేసి, అనుమతి పొందాలని సూచించారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

రాజాం సిటీ: ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని రాజాం టౌన్ సీఐ కె.రవికుమార్ అన్నారు. అవతార్ మెహర్‌బాబా కేంద్రం 37వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐ మాట్లాడుతూ..ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంత త లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, కొత్త భా గ్యలక్ష్మి, పీవీ శ్రీనివాసరావు, దేబారిక రామప్పడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



శ్రీవారి బ్రహోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకులు



యాగశాలలో హోమాలు చేస్తున్న దృశ్యం

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో శ్రీవారి(శ్రీవేంకటేశ్వరస్వామి) బ్రహ్మోత్సవాలకు ఆదివారం అంకురార్పణ చేశారు. ఆశీర్వచన మండపంలో అర్చకులు విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, అజస్ర దీపారాధన, దీక్షాధారణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి, అనంతరం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ నిర్వహించారు. ఈవో కిశోర్‌కుమార్ అర్చకులకు దీక్షావస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరిసింహాచార్యులు, కిరణ్‌కుమార్, వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో ప్రత్యేక హోమాలు..

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో ప్రత్యేక హోమాలు, పూజలు ఆదివారం నిర్వహించారు. స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించినానంతరం లోక కల్యాణార్థం యాగశాలలో సుందరకాండ హవనం, ఆదిత్య హృదయ హవనం, సుదర్శన అష్టక హవనం తదితర హోమాలు చేపట్టారు. అనంతరం స్వామి వెండి మండపం వద్ద సీతారాముల నిత్య కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా చేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరిసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రామిక మహిళా రాష్ట్ర నాయకురాలు పి.మణి

పార్వతీపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం మహిళా హక్కుల వ్యతిరేక విధానాలు విడనాడాలని శ్రామిక మహిళా రాష్ట్ర నాయకురాలు పి.మణి అన్నారు. బెలగంలో గల గిరిజన సామాజిక భవనంలో శ్రామిక మహిళా జిల్లా సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో మహిళా జిల్లా సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో, జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో మెడికల్ అండ్ హెల్త్, నర్సులు, స్కీమ్ వర్కర్లు, భవన నిర్మాణం, ఇంటి పని వారు, ప్రైవేట్ స్కూల్లో, హాస్పిటల్స్, కాలేజీల్లో, చిన్న పరిశ్రమల వంటి రంగాలలో శ్రామిక మహిళలు అత్యధిక సంఖ్యలో పని చేస్తున్నారని, పురుషులతో సమానంగా పని చేస్తున్న మహిళలకు మాత్రం సమాన వేతనం అందడం లేదన్నారు. శ్రామిక మహిళల సమస్యలు పరిష్కరించాలని, అధిక ధరలు తగ్గించాలని, నిత్యవసర సరుకులను చౌక ధరల దుకాణం ద్వారా సరఫరా చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎం.గౌరమ్మ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.మన్మధరావు, కోశాధికారి గొర్లి వెంకటరమణ, నాయకులు వి.ఇందిరా, బి.సూరిబాబు, ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, జిల్లా వ్యాప్తంగా శ్రామిక మహిళలు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ రాష్ట్ర సీనియర్ జట్టు ఎంపిక



ఎంపికైన సాఫ్ట్‌బాల్ రాష్ట్ర స్థాయి జట్టు

బొబ్బిలి: కర్నూలులో త్వరలో జరిగే రాష్ట్ర స్థా యి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొనే మెన్, విమెన్ సీనియర్ జట్లను ఎంపిక చేశారు. మండలంలో ని పారాది జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివా రం జరిగిన ఎంపిక కార్యక్రమానికి సుమారు వంద మంది హాజరయినట్టు ఎంపిక కమిటీ సభ్యులు తెలిపారు. వారిలో ప్రతిభావంతుల ను ఎంపిక చేసినట్టు ఎంపిక కమిటీ సభ్యులు సత్యనారాయణ, వెంకట నాయుడు, శ్రీను చెప్పారు.

భాగవత పోటీలకు ఎంపిక



భాగవత పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సంతకవిటి:

అంతర్జాతీయ భాగవత ఆణిముత్యాల సంస్థ నిర్వహించే పోటీలకు బొద్దూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు సుగంధం శ్రావ ణి, దేవర నవీన్ ఎంపికైనట్లు హెచ్‌ఎం మల్లేశ్వరరావు తెలిపారు. విద్యార్థులకు భాగవతంపై తెలుగు ఉపాధ్యాయుడు కృష్ణ ప్రత్యేక శిక్షణ ఇ చ్చారన్నారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు ఎ.దామోదరర్రావు, లక్ష్మీభాను, సత్యనారాయణ, ప్రసాదరావు అభినందించారు.

పర్యావరణ సమతుల్యతకు పాటుపడాలి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: పర్యావరణ సమతుల్యతకు ప్రతిఒక్కరూ పాటు పడాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పట్టణానికి చెందిన గ్రీన్‌బెల్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం వినాయక మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పర్యావరణాన్ని కాపాడుకునేందుకు సంఘాలు, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి, వనమిత్ర అధ్యక్షుడు కె. కృష్ణదాసు, మాజీ సైనిక సంఘ సభ్యులు వీఎస్ శర్మ, పట్టణ సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.

శివరామమూర్తి సేవలు ప్రశంసనీయం



శివరామమూర్తి విగ్రహాన్ని ఆవిష్కరించిన బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి, పక్కన తూర్పుకాపు కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మామిడి శ్రీకాంత్

తెర్లాం: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వపు రిజిస్ట్రార్, మండలంలోని కొరటాం గ్రామానికి చెందిన దివంగత ప్రొఫెసర్ నున్నగొప్పల శివరామమూర్తి సేవలు ప్రశంసనీయమని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. రామమూర్తి కుటుంబ సభ్యులు గ్రామంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని వారు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రిజిస్ట్రార్‌గా శివరామమూర్తి అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. కొరటాం చుట్టుపక్కల ప్రాంతాల యువతకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రధానపాత్ర పోషించారని తెలిపారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ.. శివరామమూర్తి వ్యక్తిత్వం, ఆయన భావాలు, ఆశయాలు తమకు ఎల్లప్పుడు ఆదర్శంగా ఉంటాయన్నారు. తూర్పు కాపు కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మామిడి శ్రీకాంత్ మాట్లాడుతూ, ప్రొఫెసర్ శివరామమూర్తి నేటి యువతకు ఆదర్శప్రాయుడని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కొరటాం సర్పంచ్ ప్రతినిధి చీకటి శ్రీకాంత్, జెడ్పీటీసీ సభ్యులు లూర్దు రామారావు, పాలవలస ఇందుమతి, శివరామమూర్తి కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యానవన రైతులకు ప్రోత్సాహం

మన్యంలో గతం కంటే మెరుగ్గా ఉద్యానవన పంటల సాగు వైపు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో ప్రోత్సాహం అందుతుండడంతో వీటి సాగు విస్తీర్ణం క్రమేణ పెరుగుతోంది.

- కోకోనట్, పామాయిల్ తోటల పెంపకానికి చర్యలు
- సబ్సిడీపై యూనిట్లు మంజూరు
- జీడి, మామిడి, జామ మొక్కల పంపిణీ
- గోదాంలు నిర్మించిన రైతులకు రూ.21లక్షల రాయితీ
- సోలార్ కోల్డ్ స్టోరేజ్ నిర్మించుకుంటే రూ.9.25 లక్షల సబ్సిడీ



కుశిమిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన అధికారి పేడాడ జయశ్రీ (ఫైల్)

సీతంపేట: ఉద్యానవన పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుండడంతో మన్యంలో చిన్న, సన్నకారు రైతులు ఉద్యానవనాల వైపు మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో దాదాపు 20 వేల హెక్టార్ల వరకు ఉద్యానవనాలు విస్తరించి ఉన్నాయి. జీడి, మామిడి, జామ, బొప్పాయితో పాటు సీతాఫలం, పైనాపిల్, పసుపు వంటి పంటలు విస్తారంగా పండుతాయి. కొన్ని రకాల పండ్లు తక్కువ కాలంలోనే పాడైపోతాయి. దీంతో రైతులు నష్టపోతున్నారు. వీటన్నింటి దృష్ట్యా ప్రభుత్వం కొత్తగా కోల్డ్ స్టోరేజిలు, గోదాంల నిర్మాణానికి చర్యలు తీసుకుంటుంది. దీనిలో భాగంగా రైతులకు భారీగా రాయితీలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల గోదాంలు నిర్మాణం జరుగుతుంది. పండించిన కూరగాయలు తక్కువ కాలంలో చెడిపోకుండా నిల్వ ఉంచుకోవడానికి వీలుగా అవసరమైన 30 టన్నుల కెపాసిటీ కలిగిన సోలార్ కోల్డ్ స్టోరేజి నిర్మించుకోవడానికి ఉద్యానవన శాఖ గణాంకాల ప్రకారం రూ.12.50 లక్షలు ఖర్చవుతుంది. దీనికిగాను ఉద్యానవన శాఖ రూ.9.25 లక్షల రాయితీ ఇస్తుంది. అంటే రైతు సంఘాలు కేవలం రూ.3.25 లక్షలు పెట్టుబడి పెడితే సరిపోతుంది. ఇప్పటికే జిల్లాలో సీతంపేట, వీరఘట్టం, నెల్లిగండిలలో వీటిని నిర్మించారు. 200 మంది రైతులు సంఘంగా ఏర్పడి 5నుంచి 10 గ్రామాల పరిధిలో ఉండే ఉద్యాన రైతులు 30 టన్నుల కెపాసిటీ గల కోల్డ్ స్టోరేజి రూ.27లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తే రూ.21 లక్షల రాయితీ వస్తుంది. రైతులు కేవలం రూ.6లక్షలు తన వాటాగా పెట్టుకుంటే సరిపోతుంది.

ఇదీ పరిస్థితి .



గజిలిలో నిర్మించిన అటవీ ఉత్పత్తుల కలెక్షన్ సెంటర్

వైకేపీ ఆధ్వర్యంలో అన్ని మండలాల్లో రైతు గ్రూపులు ద్వారా వాళ్లు పండించిన పంటలు దాచుకోవడానికి అవసరమైన గోదాములను 60 అడుగుల పొడవు, 40 అడుగుల వెడల్పులో పూర్తిగా గాలి, వెలుతురు సోకే విధంగా ఒక రేకుల షెడ్‌ను 2,400ల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించుకోవాలి. భూమిని ఇచ్చే దాతలు ఉంటే 25 సెంట్లు రైతు సంఘం పేరిట రిజిస్టర్ చేయాలి. పదేళ్ల కాలపరిమితిలో రిజిస్టర్ లీజ్ ఇవ్వాలి. అప్పుడు రైతు సంఘాలు రూ.15 లక్షల విలువైన గోదాం నిర్మించుకోవచ్చు. దీనికి ప్రభుత్వం రూ.11.25 లక్షల రాయితీ ఇస్తుంది. రైతులు కేవలం రూ.3.75 లక్షలు లబ్ధిదారుల వాటాగా చెల్లిస్తే సరిపోతుంది. ఇప్పటికే జిల్లాలో వీటిని వీరఘట్టం, పాచిపెంట, తోనం, గజిలి, దిగువకలువరాయి, సీతంపేట, భామిని గుమ్మలక్ష్మీపురం, రేగుమానుగూడ గ్రామాల్లో నిర్మించారు. ఇంకా నిర్మించుకుంటే పూర్తి స్థాయిలో ప్రోత్సాహిస్తామని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు. ఆయిల్‌పామ్ కొత్తగా వేసుకున్న రైతులు, పాత రైతులు వారితోట చుట్టూ సిమెంట్ పోల్స్ దానికి లింక్ మెష్‌తో ఫెన్సింగ్ వేసుకుంటే దానికి కూడా ప్రత్యేక రాయితీ ఇవ్వనున్నారు. జీడి, మామిడి, జామ తదితర తోటలు వేసుకుంటే మొక్క ధర రూ.60 కాగా ప్రభుత్వం రూ.40 సబ్సిడీ ఇస్తుంది. లబ్ధిదారుడు రూ.20 కట్టాల్సి ఉంటుంది.

ఉద్యానవన అధికారిని సంప్రదించాలి



మండల స్థాయి హార్టీకల్చర్ అధికారిని సంప్రదించినట్టయితే ఎలా దరఖాస్తు చేయాలి, ఇతర వివరాలు చెబుతారు. అలాగే ఆర్‌బీకేల ద్వారా కూడా తెలుసుకోవచ్చు. ముందుకు వచ్చే ఉద్యానవన రైతులకు అన్ని రకాల ప్రోత్సాహించడం జరుగుతుంది.

– సత్యనారాయణరెడ్డి,
జిల్లా ఉద్యానవన అధికారి

రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి



ఉద్యానవనాలకు ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సాహిస్తుంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి. పెద్ద మొత్తంలో సబ్సిడీ ఏ ప్రభుత్వ హయాంలో కూడా ఇవ్వలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భారీగా సబ్సిడీలు అందజేస్తుంది. మన్యం రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– విశ్వాసరాయి కళావతి,
పాలకొండ ఎమ్మెల్యే